# తెలిసి చేస్తున్న తప్పు

నా నోట మాట రాలేదు.

ఏం అనాలో తెలీని స్థితి

దుఃఖం గొంతు దగ్గర, కన్నీళ్ళు రెప్పల దగ్గర ఆగిపోయాయి.

ఎందుకిలా జరిగింది? లోపం ఎక్కడుంది? నాదా ! నా పెంపకమా!

ఒక్కొగానొక్క కూతురని, పూర్ణిమని గారంగా, అపురూపంగా పెంచడం నేను చేసిన తప్పా!

పూర్ణిమ అడిగింది ఏదీ కాదనలేదు. అడ్డు చెప్పలేదు.

అలాంటిది ఈ రోజున .....

పొద్దున్న ఫోన్ చేసింది.

"మమ్మీ! ఆవకాయి అయిపోయింది. ఓ సీసాలో తీసి ఉంచు. మధ్యాహ్నం చిన్నా, మున్నీని తీసుకెళ్ళడానికి వచ్చినప్పుడు తీసుకెళ్తాను. నిన్న నువ్వు పెట్టిన గుమ్మడి వడియాలు బాగా ఎండితే ఓ డబ్బాలో ఉంచు. అవి కూడా తీసుకెళ్తాను.

"అలాగేలే .... ఏమైనా టిఫిన్ చేసి ఉంచనా ....

"వొద్దు మమ్మీ .... టిఫిన్ ఏం వద్దు. యింటికెళ్తు పిజ్జా హాట్ కెళ్తాం. చిన్న మొన్నటి నుంచి ఒకటే గొడవ పిజ్జా కోసం ఇవ్వాళ వెళ్తాం అని నచ్చచెప్పాను. నువ్వు ఆవకాయ వడియాలు తీసి ఉంచు. అవునూ, పొద్దున్న ఏం వండావు?

"మజ్జిగ పులుసు, కాబేజి కొబ్బరి కూర .... "

"ఓకే మమ్మీ... మజ్జిగ పులుసు కూడా ఓ చిన్న స్టీలు కారియర్‌లో వేసి పెట్టు. "నీకు తెలుసు కదా నకూల్‌కి మజ్జిగ పులుసంటే చాలా యిష్టం అని.

"అట్లాగేలే, అన్నీ రెడీగా ఉంచుతాను ...."

స్కూటరేసుకుని వచ్చింది.

పూర్ణిమ పిల్లలిద్దర్నీ, మాయింటి దగ్గరున్న స్కూల్లో వేసింది.

పూర్ణిమ, మొగుడు నకుల్ నెలకి వారం, పదిరోజులు బయట ఊళ్ళకి వెళ్ళాల్సి ఉంటుంది. ఆ టైములో పూర్ణిమ పిల్లల్ని తీసుకుని మా దగ్గరికి వచ్చేస్తుంది.

మాక్కూడా వాళ్ళిద్దరూ మంచి కాలక్షేపం ఎప్పుడైనా లేట్ నైట్ పార్టీలుంటే, సెకెండ్ 'షో' సినిమా ప్లాన్ వేసుకుంటే నేనే స్కూలుకి వెళ్ళి పిల్లల్ని తీసుకుని వచ్చేస్తాను. నా దగ్గరే ఉంచుకుంటాను.

ఇలా చాలా ఆలోచించి పిల్లలిద్దర్నీ దగ్గర స్కూల్లోనే వేసింది.

'మమ్మీ! మళ్ళా ఆఖరి క్షణంలో మర్చిపోతానేమో. అన్నీ యిక్కడ 'టీపాయ్' ఉంచు. వెళ్ళేప్పుడు యింక మర్చిపోను...."

ఆవకాయ సీసా, వడియాలున్న పాలిథీన్ సంచి, మజ్జిగ పులుసున్న స్టీలు డబ్బా, అన్నీ కలిపి ఓ పెద్ద బాగ్‌లో పెట్టి కూచున్నాను.

"మమ్మీ! యింకొంచెం పెద్ద ఫ్లాట్ కొందామనుకుంటున్నాం మా ఎదురుగా ఎల్లోరా టవర్స్‌లోనే, సెకెండ్ ఫ్లోర్‌లో ఉండేవాళ్ళు అమెరికాకి వెళ్ళిపోతున్నారు. ఇల్లు చాలా బావుంది. మూడు బెడ్‌రూంలు, బిల్టిన్ కబోర్డులు, వంటిల్లు, దేవుడి గది .... అన్నీ సూపర్‌గా ఉంది.

"ముందు వాస్తు సంగతి చెప్పు ......."

"నాకు తెలిసిన వాస్తు నాలెడ్జితో చూసాను. అన్నీ బాగుంది. నువ్వు నాకో ఐదు లక్షలు యివ్వు....." డిమాండ్.

"ఐదు లక్షలా! ....." నా నోటమాటరాలేదు. దుఃఖం.

"ఏంటి మమ్మీ!...." నువ్వు మరీను.... పది అడిగానా అలా మొహం పెట్టావు. ఐదేగా అడిగాను .....

"మా దగ్గరేం వుందే? డాడీ రిటైరయ్యారు...."

"అందుకే అంత ధైర్యంగా అడుగుతున్నాను. పి.ఎఫ్. గ్రాట్యూటి, సికలీవ్ .... పి.ఎల్. అన్నీ ఎన్ కాష్ చేసారు కదా, అయినా నువ్వే అంటావు కదా, అంతా నాదే పని. మరి అడుగుతుంటే నువ్వివ్వాలి కదా!"

నా మాటలే నాకు బల్లెంలా పొడుచుకున్నాయి. బూమరాంగ్, మాట అన్నాను. అంత నీదే, మాకున్నదంతా నీకే. ఈ రోజున కూడా అంటాను కానీ .... మా కో బతుకుంది కదా! రిటైరయ్యాకా ఆ డబ్బుతోనే గడపాలి కదా ! నేనన్న మాటలు దానికి అర్థం లేదా! మేం ఉన్నంత వరకూ మాది. ఆ తర్వాత దానిది. ఈ అర్థం తోనే అన్నాను. కానీ .... ఆ అర్థాన్ని తిరిగి దానికి వివరించడానికి నేనిష్టపడలేదు.

ఆలోచన తక్కువ. దాని వైపు నుంచే ఆలోచిస్తుంటే నేను చెప్పేది. దాని కర్థం కాదు. పైగా ఏడిచేస్తుంది. దాన్ని ఏడిపించి ..... ఛ్ఛె ! హు.....

"అంత ఆలోచన ఏంవిటి? అంత డబ్బొచ్చింది అయినా మీరిద్దరే కదా! ఎంత కావాలేంటీ మీకు?" అంటూ లేచింది.

"బాబోయ్! మూడవుతోంది. నే వెళ్తాను" అంటూ టీపాయ్ మీద ఉన్న బాగ్ తీసుకుంది.

గేటు వరకు వెళ్ళి వెనక్కి తిరిగింది.

"ఎల్లుండి వచ్చి డ్రాఫ్ట్ తీసుకుంటాను. సరేనా ... అయ్యో!" అంటూ కుడిచేత్తో నుదురు కొట్టుకుని వెనక్కి వచ్చింది.

ఏంవయింది అనే స్థితిలో లేను.

"ఈ కమింగ్ సండే, నలుగుర్ని లంచ్‌కి పిలిచాడు. నకుల్ ఫ్రెండ్స్. కంపెని మారి నోయిడా వెళ్ళిపోతున్నాడు. ఫామిలీలు కూడా వస్తారు. నువ్వు పొద్దున్నే వచ్చెయ్యి."

రిటైరయ్యాకా, బిజిలైఫ్ లేక

ఒక్కొక్కటే మా దగ్గరి కొస్తున్నాయి.

నిన్న సడన్‌గా కళ్ళు తిరిగినట్లవుతే డాక్టరు దగ్గరికెళ్తే బి.పి. ఉందన్నారు. గబగబా నడుస్తుంటే మో చిప్ప కలుక్కుమంది.

యివి దానితో చెప్తే అర్థం చేసుకుంటుందా!

ఇదే పరిస్థితిలో ఓ అత్తగారు, కోడలు ఉంటే ....

అత్తగారు బయట పడ్తుంది. తల్లి బయటపడదు. అందుకే నేనూ బయట పడదల్చుకోలేదు.

"అలాగేలే ....."

"డాడీ వస్తానంటే యిద్దరూ రండి .... నే వస్తాను" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయింది.

పూర్ణిమ పుట్టుకతో నా లోకం మారింది.

నా ఆశలు, నా కోరికలు ఎక్కడ నిల్చిపోయాయో, ఎందుకు నిల్చిపోయాయో, అలాంటి పరిస్థితి పూర్ణిమకి రాకూడదని, నా మానసిక వ్యథ దానికి రాకూడదని, అలాంటి బాధ అది అనుభవించకూడదని, అది ఏది అడిగితే అది, ఏది నేర్చుకుంటానంటే అది నేర్పించాను.

"ఏఁవిటి ఆ గారం? నీకొక్కదానికే కూతురుందా! మరీ అంత, యిది పనికి రాదు. మంచి చెడ్డా అన్నీ నేర్పించాలి. ఆ టెన్నీస్‌కి అంత ఖర్చు చేస్తున్నారు. అది పెద్దయ్యి ఆడుతుందనే నీ ఉద్దేశం ! అక్కడెక్కడో దాన్సంటే అంత దూరం తీసుకెళ్తున్నావు? దానిష్టం ఏఁవిటి అది చూడు. కనుక్కో అంతే కానీ, నీకిష్టం అన్నీ నేర్పించేస్తే ....." అమ్మ, పిన్ని అంతా నన్ను మందలించారు.

"ఒకత్తె.... అయినా ఈ రోజుల్లో అన్నీ రావాలి. ప్రపంచం ఎలా ఉంది? ఎంత కాంపిటీషన్! చదువే కాదు, అన్నీ చూస్తారు సొసైటీలో ఎన్ని నేర్చుకుంటే అంత గ్రేట్ ...."

బట్టలు, నగలు, ఆఖరికి పట్టుచీరలు .... అది ఏది కావాలంటే అది.

'మాకేఁవయినా లోటా! మా దంతా దానిది కాదా !" అని నవ్వేసే దాన్ని నేను దానికి కొన్ని బంగారం, వెండి చూసి రాన్రాను పూర్ణిమకి కూడా అర్థం అయిపోయింది. అందుకే ఏది కావాలన్నా నిస్సంకోచంగా అడిగేది.

నేను కూడా, ఏ రోజున కూడా డబ్బు వేస్టు చెయ్యకు అది అవసరం.....

సినిమాలు, హోటళ్ళు, పార్టీలు, పిక్నిక్‌లు, బట్టలు, కాస్ట్యూం,జువెల్రీ, చెప్పులు.... ఎన్నో.... ఏ రోజున కూడా ఇన్ని చెప్పుల జతలు దేనికీ? ఏఁవిటి పార్టీలు ! అని అనలేదు.

దగ్గర్లో ఉన్న కోచింగ్‌కి వెళ్ళకుండా, ఫ్రెండ్స్ వెళ్తున్నారంటూ ఎక్కడో దూరంగా ఉన్న కోచింగ్‌కి వెళ్ళింది.

రోజూ ఆటో, రోజు సాయంత్రం ఏదో ఒకటి ఫాస్ట్‌ఫుడ్‌లో తినడం.

ఇవన్నీ ఇంకొక్క కూతురు కానీ, కొడుకు కానీ ఉన్న పూర్ణిమకి సమకూర్చే వాళ్ళ కాదు. ఒక్కత్తే కాబట్టి రోజుకు వంద రూపాయలు ఖర్చవుతున్నా, చదువుకుంటున్న పిల్లకి ఆ మాత్రం ఖర్చవుతుందని అనుకున్నాం.

మంచి రాంక్ రాలేదు. అయినా ఇంజనీరింగ్ కాలేజీ చదివించాలని మా కోరిక.

సిటిలో సీటు రాలేదు. ఊరికి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీలో సీటొచ్చింది. డబ్బు ఎక్కువే. బస్సుకి కూడా కలిపితే ఎక్కువే. అయినా బాధ పళ్ళేదు. నాలుగేళ్ళ ఫీజు ఒక్కసారే కట్టమంటే.... బరువవుతుంది అని అనుకోలేదు. అది మా బాధ్యత. మా అమ్మాయి ఇంజనీర్ అన్న ఓ చిన్న వాక్యం యిచ్చే ఉత్సాహం కోసం ఫీజు కట్టాం.

కాట్, జిమాట్, జి ఆర్ ఈ, టోఫెల్ అంటూ నాలుగో సంవత్సరం నుంచే అక్కడ కోచింగ్ యిక్కడ కోచింగ్ అంటూంటే డబ్బుయిచ్చేసాం. ఫీలవలేదు.

రోజులలా ఉన్నాయి. మా రోజులతో పోల్చాల్సిన పనే లేదు అని అనుకున్నాను.

అమెరికాలో యూనివర్శిటీల్లో అప్లై చెయ్యడానికి డబ్బు గురించి ఆలోచించలేదు. అది అమెరికా వెళ్తే మాకు సంఘంలో గొప్పగా ఉంటుందనుకున్నాం.

మంచి స్కోరు రాక, ఎయిడ్ దొరకకపోతే అమెరికా ప్రయాణం, మీద చాలా ప్రాక్టికల్‌గా, దాని గురించి ఆలోచించాము.

నెలకి లక్షల లక్షల రూపాయలు పంపగలమా! బ్యాంక్‌లు లోనులిస్తాయి కానీ, జరగరానిది ఏదయినా జరిగితే.....

పెళ్ళి చెయ్యాలి, మంచి మొగుణ్ణి తేవాలి. కట్నం ఎక్కువైనా పర్వాలేదు. అందుకని వెళ్ళే ప్రయత్నం మాని పెళ్ళికొడుకుని వెతికాం.

మంచి సంబంధం కుదిరింది. వెండి, బంగారం, డబ్బు, లాంచనాలు. బ్రహ్మాండంగా పెళ్ళి జరిపించాము.

ఉండేది ఊళ్ళోనే.

మొదట్లో బెంగ, తర్వాత వేవిళ్ళు, ఆ తర్వాత టెలివరి యిద్దరు పిల్లలు పుట్టారు. చిన్న పిల్లల్ని చూసుకోడం కష్టం, అత్తగారున్నా ఏం చెయ్యదు. సగం రోజులు మా దగ్గరే.

పండగలు, పబ్బాలు, పుట్టిన రోజులు మరోటి మరోటి. ఆయన రిటైరయి పోయారు. ఇది వరకులా జరగడం జరపడం కష్టం అని నాకు తెలుసు.

ఒక్కసారి ఆదాయం ఆగిపోయింది.

వచ్చిన పి.ఎఫ్. గ్రాట్యుటి బ్యాంక్‌లో వేసి, ఆ వడ్డీతో జీవితం గడపాలి.....

కానీ ...... ఈ రోజున

కన్నా కూతురే మా రక్షణని ఛేదిస్తోందా!

ఎందుకిలా జరుగుతోంది?

మమ్మల్ని అర్థం చేసుకునేందుకు ఏ మాత్రం ప్రయత్నం చెయ్యడం లేదు. ఎందుకని?

ఈ విషయంలో కొడుకూ కూతురూ ఒక్కలాగే ప్రవర్తిస్తారా!

మేము కూడా కొడుకులాగా ప్రవర్తిస్తే నోరుమూసుకుంటామా ! రిటైరయిపోయిన తల్లితండ్రుల్ని డబ్బులడిగితే ... పిల్లల తప్పవుతుందా! తల్లిదండ్రుల్ని అర్థం చేసుకోలేకపోతే అది పిల్లల తప్పు అవుతుందా.... కాదు.... మాదే తప్పు .... నేనే మా అమ్మాయిని సరిగా పెంచలేదు. ఆర్థిక పరిస్థితిని నేనేనాడు చెప్పలేదు.

రెగ్యులర్ ఆదాయం .... కంపెని వాళ్ళిచ్చే సదుపాయలు నౌకర్లు.... గొప్పగా గడిపిన జీవితంలో... రిటైరయ్యాకా ఏంటిటి ...... ఎలా ... అని ఆలోచించకపోవడం ... మా తప్పు కాదు .... నా తప్పు.

నేనే దోషిని

నాదే తప్పు.

నేను తల్లిని ... పూర్ణిమ కూతురు

మా మధ్య బంధం అదే నా !

మా మధ్య బంధంలో ఎమోషన్స్ లేవు.

నేనే నాడు ఇంటి ఆర్థిక పరిస్థితి వివరించలేదు. అతి ప్రేమ, గారాబం మా మధ్య ఉన్న బంధాన్ని గట్టిగా పటిష్ఠం చేసింది. కానీ, ఉండాల్సిన భావనాత్మకమైన బంధం ముడి పడలేదు.

అందరికన్నా మా అమ్మాయి గొప్పది అన్నది చూపించుకోడానికి, అందరి ముందు ఈ నెక్లెసు మా అమ్మాయికి కొన్నాం. ఎలాగు పెళ్ళి కివ్వాలి కదా! డబ్బు దాచాం ఎలాగూ పెళ్ళి గ్రాండ్‌గా చెయ్యాలనుకుంటున్నాం. అయినా మా దంత దానిదే కదా! పెళ్ళికి ముందే వెండి కంచాలు, చెంచాలు, పూజసామాన్లు పూర్తి సెట్ .... రెండు రకాల నెక్లెసులు అన్నీ గొప్పకోసం చేసాను. రిటైరయ్యాకా మాకెల్లాగా అన్న ఆలోచన నాకు రాలేదు.

నాదే తప్పు....

నాన్నగారి డబ్బు దానిది కాబట్టి. అడిగింది ఇదే భావం నేనే దాని మనసులో చిన్నప్పట్నించి వేసాను.

ఈ రోజున దాని ముందు బీదార్పులు ఎలా అరవగలను? అదే జరిగితే మేం చాలా సెల్ఫిష్ అని అనుకుంటుందేమో! నలుగురిలో అది చిన్నబోతుంది. ఇక మళ్ళీ అదే భావనకి దాసోహం. అయిపోయాను. అదే గెలిచింది. నేను ఓడిపోయాను.

ఇది జరిగిన చాలా రోజులకు .....

మా పిన్ని కూతురు శ్రీలక్ష్మి ఢిల్లి నుంచి హైద్రాబాద్ ఎవరిదో పెళ్ళికి వచ్చి, అక్కణ్ణించి మా యింటి కొచ్చింది.

"మా కూతురికి సంబంధాలు చూస్తున్నాం. నలభయి తులాలు గోల్డ్ ముందే కొని ఉంచాను. కూకట్‌పల్లిలో ఫ్లాటుంది. వెండి డిన్నర్ సెట్ కొన్నాం కట్నం ఎంతైనా ఫర్వాలేదు. యివ్వడానికి రెడి. ఏదయినా మనదంతా దానిదే కదా ! .....

'అప్పుడే అనేయకూ ..... ఈ తరంలో మనమందరం చేస్తున్న తప్పు యిదే .... కింగ్ లియర్ పరిస్థితే వస్తోంది. నాలుగు వందల యాభై ఏళ్ళ క్రితమే పిల్లల మీద ప్రేమతో అనాలోచితంగా చేసేసిన రాజు గురించి షేక్స్పియర్ రాసాను. అందులో ఎంతో నీతి ఉంది.

"చాల్లేవే...." మీ అమ్మాయి పెళ్ళయిపోయింది. ఇప్పుడు నువ్వు ఎన్నైనా కబుర్లు చెప్తావు. నీతో .... కథలు అనకు. మా కున్నది అదొక్కతే ..... ఈ ఏడాది దాని

ఎంబియే అయిపోతుంది. పెళ్ళి చేసేస్తాం. తర్వాత ..... రిటైరయ్యాకా బాధ్యతలుండవు కదా!

'రిటైరయ్యాకా జీవితం ఆగిపోతుందా! మందులు మాకులు, డాక్టర్లు, ఫీజులు, లేవలేని స్థితి వస్తే రాత్రి పగలు ఆయాలు ..... ఇదే రిటైరయ్యాకా జీవితం అక్కడే అసలు జీవితం మొదలవుతుంది అందామనుకున్నాను.

'శ్రీలక్ష్మి ఈ మానసికతని యిక్కడితో ఆపేద్దాం. నీకాధారమైన కొమ్మని నువ్వు నరుక్కోకు..."

యిదీ కూడా అందామనుకున్నాను.

అనలేదు.

శ్రీలక్ష్మి కూడా ఈ సమాజంలోని ఓ మామూలు తల్లి లాగా ఆలోచిస్తుంది. ప్రాక్టికల్‌గా కాదు.

"నేను చేసిన తప్పు అది కూడా చేస్తోంది.

'రిటైరయ్యాకా, పిల్ల బాధ్యత ఉండదు కానీ, వయసు పై బడ్డ వాళ్ళకి రావాల్సిన బాధలుంటాయి. అది కూడా ఆలోచించుకో .... అందుకే నీ శక్తి చూసుకుని సంబంధం వెతుకు. గొప్పలకు పోయి పెళ్ళికి ఎక్కువ ఖర్చు చెయ్యకు." ఈ కట్నాలు, కానుకలు, దురాచారాలకి మనమే కారణం అందుకే ఎన్ని చట్టాలొచ్చినా ఈ దురాచారాన్ని మాపు లేక పోతున్నాం...."

❖ అమ్మ మాస పత్రిక, అక్టోబర్ ❖

❖❖❖